మల్లెపందిరిమీది గోరువంకలకవ కలకల ధ్వనిచేస్తూ ఎగిరిపోయింది.

# కులమా ? కులపాలికా ?

'ప్రతిదినమును నాథుడు పిలిచినంతమాత్రమున ఇనుమడించు హర్షము ముఖమున తాండవింప చిరునవ్వుతో భర్త దరిజేర అతనిని ఐహికోత్తీర్ణుని చేస్తూవుండే ఆతరుణి నేడు మాత్రం ఎందుకో గాలితాకుడుచే కదలు లతవలె దుఃఖావేశముతో ఇంచుకదూరముననే నిలబడిఉండి 'మహాభాగా! నేను పాపిని. పతితురాల్ని మీపాదరేణు స్పర్శమునకు కూడ తగనిదానిని. నే చేసిన పాపములను మన్నింపుడు' అని శోకావేశముచే రుద్ధమును, గద్గదికమును ఐన కంఠస్వరముతో అతనిని వేడుకొన్నది.

రచయిత :

## రావులపర్తి సూర్యనారాయణమూర్తి

అది రాత్రిసమయము. రెండవ జాము సమీపిస్తూంది. గగనభాగమున రాకాసుధాకరుడు తారాసమూహముమధ్యనుండి సౌధాంతర్భాగమున కుసుమశయ్యాతల్పగతులై శృంగారరసోద్రేకములైన చుంబనాదిబహువిధబాహ్యక్రీడలచే తనివిజెందక ఇక మరి చేయునదిన్నీ లేక ఒండొరులను బిగియార కౌగలించుకొని తత్సౌఖ్యముచే తన్మయత్వమునుజెంది నిమీలితలోచనులై కాలచక్రమునుగూడ గమనించకయున్న నూత్నయౌవనవధూవరుల ప్రేమపుంజమును చూచి స్వానుభవముచే నెరిగినవాడగుటచే పరమానందముచే నుప్పొంగి ఆజన్మాంతము అదేరీతిని సుఖింపుడని సేసలు చల్లుచుండెనో యన తనశీతలకిరణప్రసారములను వారిపై బరపుచుండెను.

అట్టి సమయమున మేడపైనున్న యొకగది. అందులో శృంగారప్రాధాన్యములగు పలురకపు చిత్తరువులు అమర్చబడి ఉన్నాయి. ఒకతట్టున పలురకముల భక్ష్యములు మేజాబల్లమీద పెట్టబడిఉన్నవి. దాని సమీపంలో రెండు పేము కుర్చీలు ఒక పడకకుర్చీ ఉన్నాయి. కిటికీని ఆనుకొనిఉన్న పందిరి పట్టెమంచసుమీద మల్లెపూలు చల్లబడిన మెత్తనిశయ్య అమర్చబడి ఉంది. దీనిమీద సుమారు 20 సంవత్సరముల యువకుడు కూర్చుని యుండి తనకట్టెదుట నిలబడియున్న ప్రియురాలి నేవో లాలిస్తున్నాడు. ఆమెకు సుమారు 18 సంవత్సరములు ఉండవచ్చును.

ఆమె యెందుకో కడువిచారమనస్కయైయున్నట్లు ఆమె నయనగోళములనుండి జారిపడుతూన్న అశ్రుబిందువులే వేనోళ్ళ చాటుచున్నవి. యువకుడామెను అనేకవిధముల అనునయింప ప్రయత్నించుచూ ఆమెను తన చెంగటికి రా బిలుచుచున్నాడు. ప్రతిదినము నాథుడు పిలచినంతమాత్రమున యినుమడించు హర్షము ముఖమున తాండవింప చిరునవ్వుతో భర్త దరిజేరి ఆతనిని ఐహికోత్తీర్ణుని చేస్తూండే ఆతరుణి నేడుమాత్రము ఎందుకో గాలితాకుడుచే కదలు లతవలె, దుఃఖావేశముతో యించుక దూరముననే నిలబడియుండి 'మహాభాగా! నేను పాపిని. పతితురాల్ని. మీపాదరేణు స్పర్శమునకు కూడ తగనిదాన్ని నేజేసిన పాపములను మన్నింపుడ'ని శోకావేశముచే రుద్ధము, గద్గదికముఐన కంఠస్వరముతో అతనిని వేడుకొన్నది.

ఆదినమున ఆమె ప్రవర్తనమునకును, దుఃఖమునకును తగు కారణమును ఆతడు ఊహింపలేక 'పద్మా! ఎందుకీరోజున ఈవిధముగా ఉన్నావు? నీదుఃఖహేతువేమో నాకు తెలియజేయరాదా? నిన్ను

నేను యెన్నడునూ అనాదరించియైన ఉండలేదే? ఎందుకు నన్నీసంశయావస్థలో పెట్టి గాధిస్తావు? కారణము తెలియజేయరాదా?' అని అనేకవిధముల ఆమెను ఓదార్ప ప్రయత్నము చేస్తున్నాడు.

అంతలో విశ్వాసరావు మేడ మెట్లెక్కివచ్చి గదితలుపులను తట్టేడు. తండ్రి అకాలాగమనమునకు కారణము ఊహింపజాలక ఆ యువకుడు తలుపుతెరచి, తండ్రి కోపఘూర్ణితముఖమునుచూచి నివ్వెరపడ్డాడు. అంత విశ్వాసరావు 'మోహనా! నాకడుపున చెడ పుట్టితివి. నేటికి పండువంటి మనకుల గౌరవము భస్మీభూతము కానున్నది. దుర్మార్గుడా! వార్ధక్యంలో నాకెట్టి కష్టములను సంప్రాప్తింపజేసితివిరా?' అని మతిమాలినవానివలె కుమారుని దూషింప మొదలుబెట్టేడు.

ఇదివరకెన్నడూ, తండ్రి తనపై అంతటి కోపము జెందుట యెరుగనివాడగుటచేత మోహనుడు వెరగంది చేతులు జోడించుకొని భయవినయగౌరవములుట్టిపడ 'తండ్రీ! నేను చేసిన దుష్కృత్యమును నాకు తెలియజెప్పిన సవరించుకొందును. తనయుని తప్పులు తండ్రిగాక మరియెవ్వరు క్షమిస్తారు?' అని అతిదీనుడై వేడుకొన్నాడు.

కడుపు మండునంతటి కోపానికి లోనైనవాడైనప్పటికీ విశ్వాసరావు కుమారుని దీనావస్థనుచూచి ఒకింత బాష్పాకులితలోచనుడై 'నాయనా! నీభార్య పతితురాలు. కనుక తక్షణం యింటినుండి తరిమివేసెయ్యి, రేపు ఉదయము లోపుగా నీవామెను తరిమివేయకపోతే, నీవుగూడ నాయింట్లో ఉండుటకు నేను ఇచ్ఛగింపను. వివరములు కావలసినచో నారాయణరావు నడిగితే తెలుస్తాయి' అని నిష్కర్షగా చెప్పివేసి క్రిందికి దిగిపోయాడు.

మోహనుడు ఒక్కముహూర్తమాత్రము నిశ్చేష్టుడైయుండి తరువాత తానుగూడ మేడమెట్లు దిగిపోయాడు.

తిన్నగా మోహనుడు నారాయణరావు గృహముజేరి తలుపులు తట్టితట్టి పిలిచాడు. సేవకులంతా గాఢనిద్రాపరవశులైయున్నారు. కొంతసేపటికి నారాయణరావే తలుపులు తెరచి, అతని అకాలాగమనమునకుగల కారణమూహించినవాడగుటచేత అతనిని తిన్నగా తన ఆలోచనామందిరంలోనికి తీసికొని వెళ్లాడు. ఇద్దరు చెరొకకుర్చీమీద ఆసీనులైన తరువాత రావు ఆతని ఆగమనమునకుగల కారణమడిగాడు.

మోహనుడు 'రావుగారూ? నాభార్య పతితురాలనిన్నీ, తత్కారణమును తాము శలవీయగలరని మాతండ్రిగారు చెప్పారు. తమరు నాయందు కొంచెము దయయుంచి దానిని శలవిచ్చి పుణ్యమును గట్టుకోండి' అని అశ్రుపూరితనేత్రములతో వారిని అతిదీనముగ వేడికొన్నాడు.

అప్పుడు నారాయణరావు 'నాయనా! నీవు కొంచెము సావధానుడవై విను' అని యీరీతిగా జెప్ప ప్రారంభించారు.

"నాయనా! నీతండ్రి నేను ఏకగ్రామ నివాసులము. అత్యంత మిత్రులము. మాకు చిరకాలము సంతానము లేక లేక మీతండ్రికి నీవును, నాకొక్క కుమార్తె కలిగారు. యుక్తవయస్సు వచ్చిన తర్వాత నాకుమార్తెను నేనొక బి.యె. విద్యార్థికిచ్చి పెండ్లిజేశాను. మరుసటి సంవత్సరమున అల్లుడు ఉన్నతవిద్య నభ్యసించు తలంపుతోటి యెవ్వరికి తెలియజేయకుండానే యింగ్లాండుజేరి, తదుపరి తనకు వలయు ధనమును పంపమని మాకు ఉత్తరం వ్రాశాడు. ఇంక మరి నేను చేసేది లేక అవసరమైన ధనము పంపుతూవచ్చాను.

ఇంటిదగ్గర నాకుమార్తె భర్త రాకకు యెదురుచూస్తూ కండ్లు కాయలుకాసేటట్లుగా కనిపెట్టుకొని కూర్చుంది. కొంతకాలానికతడు చదువు పూర్తిచేసికొని తిరిగివచ్చి భార్యను చూచుటకై మాగ్రామము వచ్చాడు.

అప్పుడు మీనాయన సముద్రయానము చేసివచ్చిన మా అల్లుని యింటికి రానిచ్చినచో నన్ను వెలివేయునట్లు పురవాసులను ప్రోత్సహించాడు. అప్పుడు నేను స్వయంగా వెళ్ళి మాపూర్వస్నేహమును తలచియైననూ పోనీ అధమం నా

కుమార్తెమీద కొంచెము జాలి వహించి అయినా మా అల్లునికి శాస్త్రోక్తముగా ప్రాయశ్చిత్తము జేయించి అతనిని తిరిగి కులములోనికి జేర్చుకొను ఉపాయము జూడుమని అనేకవిధముల ప్రాధేయపడ్డాను. అప్పటికైనా ఆతనికి మామీద కరుణగలుగనే లేదు. అప్పుడు నేను చేయునదిలేక అచ్చట నా ఆస్తినంతటినీ విక్రయించివేసి ఇచ్చటికివచ్చి స్థిరపడ్డాను.

ఆ తరువాత నీవు రాజమహేంద్రవరము విద్యాభ్యాసానికని వచ్చావు. నీవు అద్దెకుతీసికొన్న యింటి ప్రక్కయింట్లోనే నీభార్య పద్మ ఉండేది. ఆయింటి యజమానికి సంతానము లేకపోవుటచేత, బాలవితంతువును, మాతాపితృవిహీనయు అయిన పద్మపై జాలి వహించి ఆమెను చేరదీసికొని తమ స్వంతకుమార్తెవలెనే సాకుచూవచ్చాడు.

పద్మ తడిబట్టలు ఆరవేసుకొనుటకు డాబామీదకు వచ్చినప్పుడు నీవు నీగది కిటికీలోనుంచి ఆమెనుజూచి, ఆమె రూపయౌవనలావణ్యములకు ముగ్ధుడవైనావు. క్రమముగా ఒకరి వీక్షణము లొకరిమీద నిలచి, ప్రేమాంకురములు పొడసూపి దినదిన ప్రవర్ధమానములయినవి.

ఇదంతా గ్రహించి పద్మ పెంపుడుతండ్రి, తన కాంతరంగికమిత్రుడనైన నాకు కబురుచేసి సర్వము తెలియజేశాడు. పద్మ ప్రియుడవు నీవే అయినందుకు నేను సంతోషించి, మీతండ్రిపై నాకుగల కసిని తీర్చుకొన సంకల్పించుకొని, అతనిచే పద్మను నీకు చేసికోవలసిందని మీతండ్రి నడిగించాను. మేము పద్మ బాలవితంతువనే సంగతి గోప్యంగా ఉంచుటచేత మీతండ్రి దానినెరుగక, ధనకాంక్షియై అందుకు సమ్మతించాడు. వివాహము త్వరలోనే విధ్యుక్తముగా జరిగింది. జరిగి ఇప్పటికి సుమారు ఆరు సంవత్సరాలయింది. పద్మ బాలవితంతువనే సంగతి వెల్లడిచేయడానికి, ఇప్పటిదాకా సరియైన సమయము రాకపోవుటచేత ఊరుకున్నాను. ఇప్పుడు నీసోదరికి వివాహసంబంధం స్థిరపడిందని తెలిసి, పెండ్లికొడుకు తండ్రికి నేనే యిదంతా తెలియజేశాను. అతడు ఛాందసుడగుటచేత, 'కుమారునకు వితంతూద్వాహం చేశారుగనుక మీ సంబంధము మాకక్కరలేద'ని మీతండ్రికి వ్రాశాడు. అందుచేత నీతండ్రి వికలమనస్కుడైనాడని" తెలియజేసి, నారాయణరావు తన కథను ముగించాడు.

అది విని మోహనుడు కొంచెంసేపు నిశ్చేష్టుడైయుండి "అయితే పద్మ నిరాధారముగా వదలివేయబడ్డట్లైతే ఆమెను దిక్కెవ్వరు? ఆమె రక్షణభారము మీరు వహిస్తారా?" అని ప్రశ్నించాడు

దానికి నారాయణరావు "నాయనా! పరులభార్యల రక్షణభారమును వహించుటకు నాకేమి హక్కున్నది?" అని ఖండితముగా సమాధానమిచ్చాడు.

"అవును వాస్తవమే!" అని మోహనుడు నిశ్చితమనస్కుడై గృహోన్ముఖుడయ్యాడు.

మోహనుడు స్వగృహమును జేరి సావడిలో అడుగుపెట్టడంతోనే "మోహనా? ఏమాలోచించావు? నీభార్యను యింట్లోనుంచి తరిమివేస్తావా లేక నీవుకూడ ఆమెతోపాటు నా గృహమును వదలి వెళ్ళిపోతావా?" అని విశ్వాసరావు ప్రశ్నించాడు.

ఇంతట్లో పద్మ అచ్చటికివచ్చి దూరాన్నుంచే మామగారికి, భర్తకి నమస్కారముచేసి కళ్ళనీళ్ళు పెట్టుకొంటూ గద్గదికమైన కంఠముతో తనతప్పులను మన్నించవలసినదని వారిని వేడి మామగారి యాజ్ఞకు ఎదురుచూస్తూవుంది. మోహనుడుగూడ ఆమెనే అనుకరించాడు. అదిచూచి విశ్వాసరావు ఒక్కయుదుటున కుర్చీలోనుంచి "ఏమిరా? దుర్మార్గుడా! కులగౌరవములను మంటగలుప సాహసిస్తున్నావా?" అని అరచాడు.

"కులమునకై శీలవతి, గుణవతి అయిన ఇల్లాలిని పరిత్యజించుటకంటె— అటువంటి ప్రేమమయి కొరకై కులగౌరవమును బలియొనర్చుటే పురుషునకు శ్రేయస్కరము, అవశ్యమనుసరణీయము" అని మోహనుడు సమాధానమిచ్చాడు.

వాకిటిముందర మల్లెపందిరిమీద వ్రాలిన గోరువంకలజత కలకల ధ్వనిజేస్తూ యెగిరిపోయింది. పందిరి వెలవెలబోయింది.